క్లుప్తంగా

వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షులు వీరే

రాయచోటి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుల పేర్లను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. అన్నమయ్య జిల్లాలోని మండలాల పార్టీ అధ్యక్షుల పేర్లు ఇలా...

అధ్యక్షుడిపేరు	మండలం
నిమ్మనపల్లి	సదాశివారెడ్డి
మదనపల్లి(రూ)	కరుణాకర్‌రెడ్డి
మదనపల్లి(ము)(సి-1)	జింక చలపతి
మదనపల్లి(ము)(సి-2)	నరేష్‌కుమార్‌రెడ్డి
రామసముద్రం	నందకిశోర్‌రెడ్డి
కెవి పల్లి	వెంకటరమణారెడ్డి
కలికిరి	చింతల రమేష్‌రెడ్డి
కలకడ	కమలాకర్‌రెడ్డి
గుర్రంకొండ	ముక్తియార్‌అహ్మద్
వాల్మీకిపురం	నీలా భాస్కర్
పీలేరు	ధను జగన్మోహన్‌రెడ్డి
కురబలకోట	కె.వాసుదేవరెడ్డి
పెద్దమండెం	మొగల్ చాంద్‌బాషా
తంబళ్లపల్లె	ఆర్.చౌడేశ్వరి
బి.కొత్తకోట	ప్రదీప్‌రెడ్డి
ములకలచెరువు	మాధవరెడ్డి
పెద్దతిప్పసముద్రం	గణపతిరెడ్డి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామ కస్బాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోవిందు (45) శుక్రవారం ఉదయం ఇంటి వద్దనే హఠాన్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ బీబీ ఆయేషా, ఉప సర్పంచ్ రెడ్డెమ్మ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుని అంత్యక్రియలకు గాను భార్య రేణుకకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

కలికిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్ పొందడానికి సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై పాలిటెక్నిక్‌లో చేరుటకు ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు రావాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9505504200, 9966209000 నంబర్లను సంప్రదించాలన్నారు.

వర్షానికి కూలిన ప్రహరీ

తంబళ్లపల్లె: మండల కేంద్రం సిద్దారెడ్డిగారిపల్లెలో మసీదు వెనుకవైపు ప్రహరీ గురువారం రాత్రి కురిసిన వర్షంతో శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ప్రజలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని హజరత్ బాబ్‌జాన్, మతపెద్దలు మస్తాన్, బాదుల్లాలు కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం కొత్తపల్లి పంచాయతీ లాభాల గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. గర్భగుడిలో గోడకట్టి అమ్మవారిని మూడు రోజుల పాటు జలాధివాసంలో ఉంచారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. రాటకొండ బాబురెడ్డి, రాటకొండ గురుప్రసాద్, సిద్దారెడ్డి, బద్రీనాథ్, విశ్వనాథరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల చిత్రపటాలతో ర్యాలీ



అమరవీరుల చిత్రపటాలతో విద్యార్థులు

ములకలచెరువు: మేర మిట్టీ – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో పలువురు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆజాదీకా అమృత్‌కలశ్‌లో భాగంగా అమరవీరుల చిత్రపటాలతో నినాదాలు చేశారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ వెంకటరమణ, విద్యార్థులు ఉన్నారు.

మేరా మట్టి – మేరా దేశ్‌కు స్పందన

కలికిరి: ఐటీబీపీ 53వ బెటాలియన్ ఆధ్వర్యంలో చేపట్టిన మేరా మట్టి – మేరా దేశ్ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి అన్నారు. ఐటీబీపీ కమాండెంట్ అమిత్ భాటి ఆధ్వర్యంలో శుక్రవారం పత్తేగడ గ్రామంలో అమృత్‌కలశ యాత్ర చేపట్టారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మట్టిని అధికారులకు అందజేశారు.

మిలాదున్ నబీ ర్యాలీ

బి.కొత్తకోట : మిలాదున్ నబీ జులూస్ ర్యాలీ శుక్రవారం స్థానిక చౌక్ మజీద్ నుంచి నిర్వహించారు. బైపాస్‌రోడ్డు, రంగసముద్రంరోడ్డు, బెంగళూరురోడ్డు, జామియామసీదు వీధుల్లో ర్యాలీ జరిపారు. ర్యాలీలో ప్రవక్త నినాదాలు చేశారు. ప్రవక్త చూపిన శాంతిమార్గంలో అందరూ నడవాలని మతపెద్దలు ప్రార్థనలు చేశారు.

త్వరలో బి.కొత్తకోటకు ఆర్టీసీ డిపో, బస్టాండ్

- మాన్యం భూమిని పరిశీలించిన ఉన్నతాధికారులు
- అధికారులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
- సత్వరమే అనుమతులు వచ్చేలా చర్యలు



ఆర్టీసీ, దేవదాయశాఖ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : బి.కొత్తకోటకు ఆర్టీసీ డిపో, బస్టాండ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతోంది. గత ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆర్టీసీ డిపో, బస్టాండ్ ఏర్పాటు చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. గత మూడేళ్లుగా చేస్తున్న ఆయన కృషి ఫలిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ప్రజారవాణాశాఖ, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు బి.కొత్తకోటలో పర్యటించారు. స్థానిక బెంగళూరురోడ్డులోని ఆలయ మాన్యం భూములను పరిశీలించారు. 9.91 ఎకరాల భూమిలో ఏడు ఎకరాలు ప్రజారవాణాశాఖకు కేటాయిస్తే ఆర్టీసీ బస్‌డిపో, బస్టాండ్ నిర్మించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. 32 ఏళ్లపాటు ఈ భూమిని ప్రజారవాణాశాఖకు లీజుకు ఇచ్చేలా నిర్ణయించారు. దీనికి సంబంధించిన రికార్డులు, నివేదికలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకున్నారు. మొత్తం భూమిలో ఏడు ఎకరాలు ఇస్తే సరిపోతుందని ఆర్టీసీ అధికారులు విన్నవించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఆయాశాఖల ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

ఎమ్మెల్యే సమీక్ష

ఆర్టీసీ ఆర్ఎం పడగండ్ల రాము, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్, జిల్లా అధికారి సి.విశ్వనాథ్, ఆర్టీసీ ఈఈ వెంకటరమణ, డీఎం వెంకటరమణారెడ్డి, ఈఓ మునిరాజులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమీక్ష నిర్వహించారు. బి.కొత్తకోటలో ఆర్టీసీడిపో, బస్టాండ్ నిర్మాణం అత్యవసరమని వెల్లడించారు. కర్ణాటక సరిహద్దులోని ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని గుర్తుచేశారు. ఎన్నికల్లో వీటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వనప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి, వసతుల కల్పన తమ లక్ష్యమని అన్నారు. బస్‌డిపో, బస్టాండ్ కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేసినట్లు చెప్పారు. సీఎం, మంత్రులు సానుకూలంగా ఉండటంతో వీటి ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

బి.కొత్తకోట నగర పంచాయతీలో అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో కమిషనర్ పి.ఆర్.మనోహర్, తహసీల్దార్ రఫీక్‌అహ్మద్, హౌసింగ్ డీఈ శ్రీహరి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగర పంచాయతీ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోట్లరూపాయలతో జరుగుతున్న మురికినీటి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణపనులను సత్వరమే పూర్తిచేయించాలని ఆదేశించారు. నగరపంచాయతీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పేదలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందించాలని కోరారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలను ప్రగతిని, చెల్లించిన బిల్లులు, నగరపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు, మంజూరైన పనులు, టెండర్లు నిర్వహించిన పనులకు సంబంధించి సమీక్షించారు.

రెడ్డెమ్మకొండ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ: మండలంలోని సంతానదేవత రెడ్డెమ్మకొండ ఆలయానికి హుండీ ద్వారా రూ.7,79,895 ఆదాయం సమకూరింది. శుక్రవారం స్థానిక ఆలయంలో మదనపల్లె దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూపంలో రూ. 7,79,895 బంగారం 38 గ్రాములు, వెండి కానుకలు 505 గ్రాములు వచ్చినట్లు లెక్కతేల్చారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయం మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సచివాలయాల ఉద్యోగులు, ఆలయ అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

1505 ఇంటి పట్టాల పంపిణీకి సిద్ధం



లక్కీడిప్‌లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న అధికారులు

పీలేరు : ఏపీఐఐసీ లేఅవుట్-3లో మూడో విడత 1505 పట్టాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు తహసీల్దార్ కె. ధనుంజయులు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 70 మందికి లక్కీ డిప్ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశాల మేరకు ఏపీఐఐసీ లేఅవుట్-4లో మరో 1900 మందికి ఇంటి పట్టాలు పంపిణీకి 65 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, వీఆర్‌వోలు యర్రయ్య, కవిత, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించాలి

– ఆర్డీఓ మురళి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు చొరవచూపాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డివిజన్‌స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి తక్షణమే స్పందించి కేసు నమోదుచేసి త్వరితగతిన విచారణ జరిపినప్పుడే సరైన న్యాయం అందించగలుగుతామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదువచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుచేసి త్వరితగతిన కేసు ఇన్వెస్టిగేట్ చేసి ప్రాథమికంగా 25 శాతం నష్టపరిహారం ఇప్పించాలని సూచించారు. కేసును 60 రోజుల్లోపు పరిష్కరించకపోతే బలహీనపడే అవకాశముందని, చార్జ్‌షీట్ దాఖలు చేసి క్లియర్‌గా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ప్రతి సోమవారం మండలస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటారని, సమస్యలపై వారికి తెలిపితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటారన్నారు. ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని బి.కొత్తకోట, మదనపల్లె టూటౌన్, ముదివేడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులను రిమాండ్‌కు పంపి పటిష్టంగా కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఎప్పుడూ బలహీనవర్గాలకే మద్దతుగా నిలుస్తుందన్నారు. బాధితులు పోలీసుల సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి , భారతీయ అంబేద్కర్‌సేన(బాస్), వీసీకే పార్టీ నాయకులు పీటీఎం.శివప్రసాద్ మాలమహానాడు రాష్ట్రనాయకులు యమలా సుదర్శనం ఆర్‌జీఎస్ కోనేటిదివాకర్, బసినికొండ సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మదనపల్లె సిటీ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ సుజాత అన్నారు. శుక్రవారం స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించినవారికి కఠిన చర్యలు తప్పవన్నారు. ఆడపిల్లలు 18 ఏళ్లు నిండేవరకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకాంత పాల్గొన్నారు.

జాస్ జిల్లా అధ్యక్షురాలిగా రాజేశ్వరి

పీలేరు రూరల్ : జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం (జాస్) జిల్లా అధ్యక్షురాలిగా పీలేరుకు చెందిన జి. రాజేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి నగర్‌లో జాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అధ్యక్షులు ఎస్.ఆర్. చంద్ర ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా లీగల్ అడ్వైజర్‌గా సదాశివకుమార్, పీలేరు మండల అధ్యక్షులుగా మల్లికార్జున, సలహాదారుగా జయరామచంద్రయ్య, జిల్లా రైతు విభాగం అధ్యక్షులుగా సురేంద్ర, అధికారి ప్రతినిధిగా రెడ్డెయ్య, మండల మహిళా విభాగం అధ్యక్షులుగా ప్రభావతి, అధికార ప్రతినిధి సుహాసిని, సభ్యులుగా రేణుక, నాగరత్నలను ఎన్నుకున్నారు. సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సమస్యలపై తన పోరాటం చేస్తామని తెలిపారు.

మెడికల్ కాలేజీ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

మదనపల్లె : మండలంలోని ఆరోగ్యవరంలో నిర్మాణం జరుపుకుంటున్న మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలను శుక్రవారం ఎమ్మెల్సీ భరత్, కుప్పం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్.సుధీర్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డితో కలిసి సందర్శించారు. జరుగుతున్న అభివృద్ధిపనులపై మెడికల్ కళాశాల ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయం, మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న వసతులు, ఇతర వివరాలపై విచారించారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న మెడికల్ కాలేజీ పడమటి నియోజకవర్గాలైన పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లె ప్రజలకు వైద్యసేవలకు వరప్రదాయినిగా ఉంటుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డెప్ప పాల్గొన్నారు.

కొత్త పోలింగ్‌స్టేషన్లకు ఆమోదం

మదనపల్లె : ఓటర్లు 1,400కు మించి ఉన్నటువంటి పోలింగ్ కేంద్రాలను విభజిస్తూ.. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనలకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... నియోజకవర్గంలో 33 పోలింగ్ స్టేషన్లను బదిలీ చేస్తున్నామన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన ఓటర్లకు సంబంధించి ఫారం-బిలు ఇవ్వాలన్నారు. బీఎల్వోలు ఇంటింటిసర్వేలో 3,495 మంది ఓటర్లు షిఫ్ట్ అయినట్లు గుర్తించారని, వీరందరి నుంచి ఫారం-బి తీసుకోవాలన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం నియోజకవర్గంలో 95శాతానికి పైగా పూర్తయిందన్నారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, దైవరాజన్, సీఆర్.మంజుల, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు

మదనపల్లె సిటీ: మండలంలో శనివారం నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. ఈ క్యాంపులు అక్టోబర్ 28 వరకు జరుగుతాయన్నారు. సిటీఎం పీహెచ్‌సీ కింద ఉన్న 10 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో తహశీల్దార్ ఆధ్వర్యంలో, బొమ్మనచెరువు పీహెచ్‌సీ పరిధిలోని 10 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో క్యాంపులు జరుగుతాయన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులతో హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అరికెల విద్యార్థి



ఎస్.ఇందు

రామసముద్రం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రంలో పాఠశాలలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి విభాగంలో అరికెల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ ఎస్.ఇందు(10 వ తరగతి) ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.గురునాథం తెలిపారు. త్వరలో జరగబోయే ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు , విద్యార్థులు అభినందించారు.

వెబ్‌ల్యాండ్‌తో ఆలయ భూములకు రక్షణ

– దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

బి.కొత్తకోట : జిల్లాలో ఆలయ భూముల సంరక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని దేవదాయశాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం బి.కొత్తకోట ఆలయాల భూముల పరిశీలనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటివరకు 9,221 ఎకరాల ఆలయభూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఆలయ భూముల వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణదారుల చెరలో ఉంటే వారికి నోటీసులు ఇచ్చి రెవెన్యూ, పోలీస్ అధికారుల ద్వారా స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫేజ్-3కింద ఎస్సీ,ఎస్టీ,బీసీ కాలనీలకు 61 ఆలయాలు మంజూరైనట్లు చెప్పారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి

తంబళ్లపల్లె: విద్యార్థిని భవ్యశ్రీ హత్యకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని బాలలహక్కుల ఐక్యవేదిక కన్వీనర్ నరసింహులు కోరారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాల పురానికి చెందిన విద్యార్థిని భవ్యశ్రీని కిరాతకంగా చిత్రహింసలు పెట్టి హత్య చేసిన హంతకులను శిక్షించాలని కోరారు. ఆమె ఆత్మకు శాంతికలగాలని శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద క్యాండిల్స్ వెలిగించి మౌనం పాటించారు. సీడీపీవో నాగవేణి, సూపర్‌వైజర్లు కళావతమ్మ, నాజియాభేగం, నాగలక్ష్మీ, పోర్టు సిబ్బంది రెడ్డెమ్మ, అనిత, భువనేశ్వరి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

గుర్రంకొండ: కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్‌గా నియమిస్తూ జీఓ జారీచేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేస్తూ ఇటీవల శాసన సభలో బిల్లు ఆమోదించారు. ఈ బిల్లు ద్వారా స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా రెగ్యులర్ లెక్చరర్లుగా మారుతున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కాంట్రాక్ట్ లెక్చరర్లు సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞత చాటుకొన్నారు. ఈసందర్భంగా జమీర్‌ఖాన్, రంగారెడ్డిలు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయులు సీఎం అన్నారు. ఎంతో ముఖ్యమంత్రులు చేయలేని, తీసుకోలేని సాహసోపేత నిర్ణయం సీఎం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఆయనకు జీవింతాతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు జమీర్‌ఖాన్, రమాదేవి, భారతి, వెంకటరమణ, రంగారెడ్డి మనోహర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో నిధుల రికవరీ



సామాజిక తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న డీఆర్‌పీలు

పెద్దమండ్యం: ఉపాధి పనుల సామాజిక తనిఖీలో రూ.30,940 వేలు రికవరీకి జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధశాఖల ద్వారా ఖర్చు చేసిన రూ.7.73 కోట్లుకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎస్ఆర్‌పి నీలకంఠ పర్యవేక్షణలో 15 మంది డీఆర్‌పీలు మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులను పరిశీలించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌పీల పరిశీలనలో గుర్తించిన అంశాలను వివరించారు. పలుచోట్ల చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్, పండ్లతోటల పెంపకంలో మొక్కలు చనిపోయినట్లు పీడీ దృష్టికి తెచ్చారు. మొక్కలు చనిపోయిన చోట తిరిగి మొక్కలను నాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా రోడ్ల విస్తరణ పనుల్లో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా చేపట్టిన మొక్కలు దెబ్బతిన్నట్లు సిబ్బంది పీడీ దృష్టికి తెచ్చారు. కూలీలు చేపట్టిన పనుల్లో కొలతల్లో వచ్చిన తేడా, మస్టర్లలో వచ్చిన తేడాల కారణంగా గుర్తించిన సొమ్ము రూ.30,940 వేలు రికవరీకి పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏపీడీలు నందకుమార్‌రెడ్డి, ప్రతాప్, అంబుడ్స్‌మెన్ శివప్రసాద్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గణేష్, జడ్పీటీసీ పీరమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, ఏపీవో మురళి, ఎస్ఆర్‌పి నీలకంఠ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా



సీఐ తమ్మిశెట్టి మధుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ములకలచెరువు: ములకలచెరువు సీఐగా తమ్మిశెట్టి మధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ సాదిక్ అలీ అన్నమయ్య జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని మండలాల్లో ప్రజల శాంతి భద్రతలపై రాజీ లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

సీఐని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ తమ్మిశెట్టి మధును మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో కలిశారు. అనంతరం పూల మాలలతో సన్మానించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు అందరూ పోలీసులకు సహకరించాలని సీఐ వారిని కోరారు. సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రవిశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, విశ్వనాథ్, మల్లికార్జునరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చాంద్‌బాషా, మంజునాథ్, రామనాథం తదితరులు ఉన్నారు.

జలవనరుల సంరక్షణతో భావితరాలకు భవిష్యత్తు



విజేతలతో అధ్యాపక బృందం

వాల్మీకిపురం: జలవనరుల సంరక్షణతోనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో జిల్లా ఉన్నత విద్యాశాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నీటి వనరుల నిర్వహణ అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరై పాల్గొన్నారు. మదనపల్లి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన అనిత ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, ఇదే కళాశాలకు చెందిన మహిర్ ద్వితీయ బహుమతిని సాధించాడు. అలాగే రాయచోటికి చెందిన అలియా తృతీయ బహుమతిని సాధించింది. వీరికి పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, స్థానిక ప్రిన్సిపల్ కృష్ణమూర్తి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నోడల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, డీఆర్‌సీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, అధ్యాపకులు రేణుక, పెద్ద రాజు, రాఘవ రెడ్డి, సుదర్శన్, జ్యోతి, నిజాముద్దిన్, హరి, నిర్మల పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్

కేవీపల్లె : గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారను. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ ఫజురుల్లా, మహల్‌రాజుపల్లె, తిమ్మాపురం సర్పంచ్‌లు నీలావతమ్మ, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం, కార్యదర్శి తనూజ, వీఆర్‌వో వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నిమ్మనపల్లె : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. రోడ్డుప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నిమ్మనపల్లె నుంచి తవళం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు, చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తతతో వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్‌లైసెన్స్ తదితర రికార్డులను కలిగి ఉండాలని పేర్కొన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్‌రైడ్ చేయరాదని సూచించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

తంబళ్లపల్లె: మండలంలో బీజేపీ బలోపేతానికి నాయకులు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 36 పోలింగ్ బూతులలోనూ శక్తి కేంద్రాలుగా గుర్తించి కమిటీలు వేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పేదలకు అమలు పరుస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మయ్య, శంకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జయరామ్, సురేంద్ర, రాజేశ్వరి, భవాని తదితరులు పాల్గొన్నారు.

రూ.81 లక్షలతో రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామసముద్రం: రామసముద్రం మండలం ఎలవానెల్లూరు పంచాయతీ పిల్లిగుండ్లపల్లి రూ.81 లక్షలతో రోడ్డు పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. పైగడ్డ నుంచి 1.2 కిలో మీటర్ల దూరంలో ఉన్న పిల్లిగుండ్లపల్లికు రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతోందన్నారు. గ్రామానికి రోడ్డు మంజూరు చేసి సౌకర్యం కల్పించినందుకు ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.